# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 26 బుధవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 245

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





2లో

## ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

ఏడాదయినా కార్యరూపం దాల్చని పథకం

2లో



## తప్పుడు లెక్కలపై నిలదీత

**మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్**

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర అన్నీ తప్పుడు లెక్కలే ఉన్నాయని, ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారాలపై అసెంబ్లీలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని నిరూపించగలవా అని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్ రావు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ జరగలేదని మంత్రి శ్రీధర్ బాబు సత్యదూరం మాటలు మాట్లాడారు. నేను ఛాలెంజ్ వేస్తున్నా.. బీఆర్ఎస్ హయాంలో 26 వేల ఉపాధ్యాయ నియామకాలు జరిగాయి.. 8 వేల ఉద్యోగాలు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా, మరో 18 వేల ఉద్యోగాలు గురుకులాల్లో నియామకాలు చేసినం. 26 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తే ఒక్కటి కూడా భర్తీ చేయలేదని శ్రీధర్ బాబు మాట్లాడడం సరికాదు. ఇక రెండో విషయానికి వస్తే.. ఎన్ని స్కూళ్లు మూతపడ్డాయని మా సబితక్క అడిగితే.. 79 స్కూల్స్ తెరిపించామని బాగానే చెప్పారు.

కానీ కాంగ్రెస్ పాలనలో మూతబడ్డ 1913 స్కూళ్ల సంగతి ఎందుకు మాట్లాడరని అడుగుతున్నానని మంత్రి శ్రీధర్‌బాబును హరీశ్‌రావు ప్రశ్నించారు.

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు

# గ్రీన్ సిగ్నల్

### మంత్రి పదవిపై పలువురి ఆశావహుల ఆశలు

### మంత్రి పదవి ఎవరిని వరిస్తుందోనని చర్చలు



హైదరాబాద్:ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురుచూస్తోన్న తెలంగాణ కేబినెట్ విస్తరణకు ముహూర్తం దగ్గరపడింది. ఉగాది కానుకగా తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నాలుగు మంత్రి పదవులు, డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ పదవుల భర్తీకి ఆమోద ముద్ర పడింది. అయితే కేబినెట్‌లో రెండు బెర్త్‌లను పెండింగ్‌లో పెట్టాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో తెలంగాణ సీఎం, కాంగ్రెస్ కీలక నేతలతో ఢిల్లీలో సోమవారం సుదీర్ఘ సమావేశం జరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్.. అధిష్టానంతో భేటీ అయ్యారు. తెలంగాణలో ప్రభుత్వ పథకాల అమలు తీరును వివరించారు. పార్టీ బలోపేతంపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. అన్ని విషయాలతో పాటు కేబినెట్ విస్తరణపై కూడా చర్చ జరిగిందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. మార్పు నినాదంతో కాంగ్రెస్ అధికార పగ్గాలు చేపట్టి ఏడాదిన్నరయింది. అదిగో ఇదిగో అంటూ కేబినెట్ విస్తరణ ఆశవహులను ఊరిస్తూనే ఉంది. ప్రస్తుతం సీఎం సహా 12 మంత్రులు వున్నారు. లెక్క ప్రకారం కేబినెట్‌లో మరో ఆరుగురికి చోటు వుంటుంది. రెండు పెండింగ్‌లో పెట్టాలనే నిర్ణయం జరిగినట్టు చర్చజరుగుతోంది.ఆ లెక్కన మంత్రి పదవి దక్కనున్న ఆ నలుగురు ఎవరన్నది ఆసక్తికరంగా మారిందిప్పుడు. సామాజిక సమీకరణాల ప్రకారం ఎస్టీ లంబాడకోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ తన ఆవాజ్ విన్పించడం సహా సీనియర్ నేత జానారెడ్డి అండదండలతో గట్టిగా ప్రయత్నాలు చేశారనేది టాక్.. అల్రెడీ నల్లగొండ జిల్లా నుంచి కేబినెట్‌లో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఫిర్‌బీ తనకు చాన్స్ పక్కా అనే ధీమాతో ఉన్నారు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. మరోవైపు వివేక్ వెంకటస్వామి, పెద్దల సభ నుంచి అద్దంకి దయాకర్, విజయశాంతికి అవకాశం వుండొచ్చనే ప్రచారం తెరపైకి రానే వచ్చింది. ప్రొఫెసర్ కోదండరామ్ పేరు కూడా పరిశీలనలో ఉందనే ప్రచారం జరిగింది. ఇక మంత్రి పదవి లేకపోవడం వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం జరుగుతుందంటూ తనకు కేబినెట్‌లో చోటివ్వాలని చెప్పకనే చెప్పారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి .తనకు చాన్స్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తానంటూ అలకాస్త్రం కూడా ప్రయోగించారు.. ఇక మైనార్టీ కోటా నుంచి కూడా కాంపిటేషన్ ఎక్కువగానే ఉంది. లైన్‌లో అలా ఎందరో ఆశవహులు ఉన్నారు. మరి వారిలో కేబినెట్ బెర్త్ చేజిక్కించుకునే ఆ నలుగురు ఎవరు? ఉగాది తెలంగాణ కేబినెట్ విస్తరణ ఖాయమనే సంకేతాలయితే వచ్చేశాయి. మరోవైపు ఏప్రిల్ 8,9న గుజరాత్‌లో జరిగే ఏఐసీసీ సమావేశాల కోసం రణదీప్ సూర్జేవాల నేతృత్వంలో 15 మందితో కమిటీ నియమించారు. అందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు చోటు దక్కింది. మరి ఉగాది వేళ మంత్రిగిరికి సంబంధించి తీపి కబురు ఎవరికి? టఫ్ కాంపిటేషన్ నేపథ్యంలో రాజపూజ్యం-అవమానాలు..అసంతృప్తులు ఏ రేంజ్‌లో ఉంటాయోననే దానిపై కాంగ్రెస్ పార్టీలో చర్చ మొదలైంది.



## మొత్తం 35 సవరణలకు అనుమతి

లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం



## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్

గత తీర్పులను ఎలా కాదనగలమన్న ధర్మాసనం విచారణ ఏప్రిల్ 2కు వాయిదా



## పాఠశాలల మూసివేతపై సభలో వాగ్వాదం

**పాఠశాలల మూత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశాలపై శాసనసభలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పిల్లలు చేరలేదని చెబుతూ 1,913 పాఠశాలలను మూసేశారని, కేవలం 10 మందిలోపే ఉన్నారనే సాకుతో మరో 4,000 స్కూళ్లలోని విద్యార్థులను ఇతర పాఠశాలలకు పంపాలని చూస్తున్నారని భారాస ఎమ్మెల్యే సబితారెడ్డి తొలుత ఆరోపించారు.**

హైదరాబాద్: పాఠశాలల మూత, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ అంశాలపై శాసనసభలో భారాస, కాంగ్రెస్ సభ్యుల మధ్య మంగళవారం తీవ్ర వాగ్వాదం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పిల్లలు చేరలేదని చెబుతూ 1,913 పాఠశాలలను మూసేశారని, కేవలం 10 మందిలోపే ఉన్నారనే సాకుతో మరో 4,000 స్కూళ్లలోని విద్యార్థులను ఇతర పాఠశాలలకు పంపాలని చూస్తున్నారని భారాస ఎమ్మెల్యే సబితారెడ్డి తొలుత ఆరోపించారు. విద్యాశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూ... "భారాస పాలనలో ఆరు వేల స్కూళ్లను మూసేశారని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అధికారంలోకి రాగానే వాటిని తెరిపిస్తామన్నారు. వాటిలో ఎన్నింటిని తెరిచారో చెప్పాలి. ప్రతి గ్రామ పంచాయతీలోనూ పాఠశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరిప్పుడు 257 పంచాయతీల్లో పాఠశాలలు ఎందుకు లేవో వెల్లడించాలి. విద్యాశాఖ సీఎం వద్దే ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3.60 లక్షల మంది విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గింది" అని ప్రశ్నించారు. వ్యవస్థను సరిచేసేందుకు సమయం పడుతుంది మంత్రి శ్రీధర్‌బాబు కల్పించుకుని... "పదేళ్ల భారాస పాలనలో కుప్పకూలిన విద్యావ్యవస్థను సరిచేయడానికి సమయం పడుతుంది. ఈ ఏడాది 79 పాఠశాలలను తిరిగి తెరిపించాం. నాటి సీఎం కేసీఆర్ ఒక్కసారి కూడా విద్యాశాఖపై సమీక్షించలేదు. డీఎస్సీ ద్వారా ఒక్క టీచర్‌ను కూడా నియమించకపోవడంతోనే పాఠశాలలు మూతపడ్డాయి. మేం వాటిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాం. భారాస పాలనలో విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సబితారెడ్డి చాలా పనులు చేయాలనుకున్నా ఆ వ్యవస్థ ఒకవైపే నడవడంతో ఏమీ చేయలేకపోయారు" అని విమర్శించారు. దీనిపై భారాస సభ్యుడు హరీశ్‌రావు అభ్యంతరం చెబుతూ... "మేం 26 వేల మంది ఉపాధ్యాయులను నియమించాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మూసివేసిన పాఠశాలలపై శ్రీధర్‌బాబు ఎందుకు మాట్లాడరు?" అని ప్రశ్నించారు. తిరిగి సబితారెడ్డి మాట్లాడుతూ... "మీరు చిత్తశుద్ధితో పనిచేస్తే విద్యార్థులు ఎందుకు తగ్గారనే దానిపై సమీక్షించుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల భవనాలను మనఊరు-మనబడి కింద భారాస పాలనలో బాగుచేశాం. మిగిలిన వాటిని మీరు బాగు చేయాలి. ఒక్కో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు ఖర్చు పెడతామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం... ఇతర ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.4 వేల కోట్లు పెట్టలేదా? వాటిని మూసివేస్తారా? అరకొర బడ్జెట్‌తో విద్యారంగాన్ని ప్రపంచస్థాయిలో ఎలా అభివృద్ధి చేస్తారు? సమగ్ర శిక్షా కింద ఈ ఏడాది రూ.1,913 కోట్లు ఇవ్వడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. వీటిలో మూడో త్రైమాసికానికి ఇటీవల రూ.242 కోట్లు ఇచ్చినా... రాష్ట్ర వాటా రూ.160 కోట్లు విడుదల చేయకపోవడంతో వెనక్కిపోయాయి. దాంతో వచ్చే ఏడాది(2025-26)కి తెలంగాణకు రూ.1,600 కోట్లే ఇస్తామని కేంద్రం తెలిపింది. ఈ వైఫల్యం ఎవరిదో కచ్చితంగా ప్రశ్నించుకోవాలి. ఇక కొడంగల్ పాఠశాలల్లో మాత్రమే ఉదయం అల్పాహారం పెడుతున్నారు. దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలి" అని కోరారు.

## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు



కేటీఆర్‌ను హెచ్చరించిన రాజాసింగ్



## ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం

## 'ఆర్‌ఆర్‌ఆర్'పై వాడీవేడి చర్చ



హైదరాబాద్: రీజనల్ రింగ్‌రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్)పై ఆర్ రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆ శాఖ మాజీమంత్రి, భారాస సభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డిల మధ్య మంగళవారం శాసనసభలో వాడీవేడిగా చర్చ సాగింది. 'ఆర్‌ఆర్‌ఆర్ సృష్టికర్త కేసీఆర్.. మా హయాంలోనే ఆ ప్రాజెక్టును ప్రతిపాదించాం. కాంగ్రెస్ 15 నెలల్లో దీనికోసం ఎకరా భూమి కూడా సేకరించలేదు' అని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దీనికి మంత్రి బదులిస్తూ.. 'ఈ ప్రాజెక్టు మీద భారాసకు మాట్లాడే హక్కులేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం వేగం పుంజుకొంది' అని అన్నారు. సభలో మంగళవారం బడ్జెట్‌పై చర్చ జరిగింది. సభ ప్రారంభం కాగానే 'ఆర్‌ఆర్‌ఆర్'పై చర్చ సాగింది. ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్‌ఆర్‌ఆర్ ప్రాజెక్టుకు కాంగ్రెస్ నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికీ ఆర్‌ఆర్‌ఆర్‌కు ఎన్‌హెచ్ నంబర్ రాలేదని, అందుకే రైతులకు పరిహారం ఇవ్వలేకపోతున్నారన్నారు. సచివాలయంతోపాటు, కలెక్టరేట్ భవనాలు, ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసులు, వైద్య కళాశాలలు, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు, యాదాద్రి ఆలయం, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపం, కమాండ్‌కంట్రోల్ భవనం లాంటివెన్నో కట్టింది తమ హయాంలోనేనని అన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్‌కు 2017లో గెజిట్ రాగా, 2018లో పనులు ప్రారంభమై రెండు మూడేళ్లు నడిచాయన్నారు. భారాస హయాంలో ఆర్‌అండ్‌బీకి రూ.24 వేల కోట్లను వెచ్చించగా అందులో రూ.4 వేల కోట్లు అప్పు అని మిగతాది బడ్జెట్‌నుంచి వెచ్చించామని వివరించారు. ప్రశాంత్‌రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. ప్రాజెక్ట్ ఎలైన్మెంట్ అండ్ టెక్నికల్ కమిటీ ఆమోదించగానే రైతులకు పరిహారం చెల్లించడం సాధ్యమవుతుందన్నారు. ఇటీవల కేంద్రమంత్రి గడ్కరీని కలిసినప్పుడు మరో 2నెలల్లో ఆర్‌ఆర్‌ఆర్‌కు కేంద్రకేబినెట్ ఆమోదం లభిస్తుందని చెప్పారని వివరించారు. దక్షిణభాగానికి అనుమతులు వచ్చేలా ముందుకెళుతున్నామన్నారు. గత ప్రభుత్వం సిరిసిల్ల, గజ్వేల్, సిద్దిపేట నియోజకవర్గాల రోడ్లపైనే దృష్టిపెట్టిందని, ఇతర నియోజకవర్గాల రహదారులు వారికి కనిపించలేదన్నారు. తాము హ్యామ్ విధానంలో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఉప్పల్ ఫ్లైఓవర్ విషయంలో ప్రశాంత్‌రెడ్డి మాటలు వెనక్కి తీసుకోవాలన్నారు.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్



**న్యూఢిల్లీ:** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు ఏప్రిల్ 2కు వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఫిరాయింపుల వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు చర్య తీసుకునేందుకు తగిన సమయం అని చెప్పలేదని.. అలాంటప్పుడు వాటిని కాదని తామెలా వెళ్లగలమని సుప్రీం ప్రశ్నించింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి ఎలా రాయగలం అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం.. పిటిషనర్ల తరపు న్యాయవాదులను ప్రశ్నించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి అనర్హత పిటిషన్లపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది అరియామా వాదనలు వినిపిస్తున్నారు. ముగ్గురు ఎమ్మెల్యేపై వేరు వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదని.. నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ తరఫున లోకసభ ఎన్నికల్లో పోటీ- చేసి ఓడిపోయారని దానం నాగేందర్ గురించి ధర్మాసం దృష్టికి తీసుకొచ్చారు న్యాయవాది. ఆ తర్వాత కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారని తెలిపారు. ఫిర్యాదులపై ఏం చేస్తారో... నాలుగు వారాల్లో షెడ్యూల్ చేయమని మాత్రమే హైకోర్టు గతంలో ఆదేశాలు ఇచ్చిందని.. అయినప్పటికీ స్పీకర్ పార్టీ మారిన వారికి నోటీసులు ఇవ్వలేదన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి.. విచారణ సందర్భంగా ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీ-సు ఇచ్చారన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 13న మూడు వారాల్లో రి÷-లపై ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చారన్నారు. ఇప్పటికి మూడు వారాలు అయ్యిందని.. ఆ మూడు వారాలు, నోటీ-సులు ఎటు-వెళ్లాయో తెలీదని కౌశిక్ రెడ్డి న్యాయవాది తెలిపారు. తాము ఫిర్యాదు చేసి దాదాపు ఏడాది పూర్తి అయిందని.. ఇప్పటికీ స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదని న్యాయవాది సుందరం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయ్యిందా అని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నవ్వుతూ చెప్పారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఉన్నారని.. రాజ్యాంగ పరిరక్షణకు కట్టు-బడి ఉండాలని.. రాజ్యాంగం కల్పించిన హక్కులు, అధికారాలను కూడా పరిరక్షించాల్సిన బాధ్యత స్పీకర్‌పై కూడా ఉందని న్యాయవాది సుందరం తెలిపారు. ఒకవేళ అది జరగడం లేదు అని భావిస్తే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించడానికి కూడా రాజ్యాంగం అవకాశం కల్పించిందన్నారు. అలాంటి సందర్భంలో.. రాజ్యాంగ పరిరక్షకులుగా కోర్టులు జోక్యం చేసుకోవచ్చని చెప్పుకొచ్చారు. స్పీకర్ క్వాషీ జ్యూడిషియరీ అధికారాలతో ఒక ట్రిబ్యునల్‌గా స్పీకర్ వ్యవహరించాలన్నారు. స్పీకర్ అధికారాల్లోకి వెళ్లాలని, ఆయన విధుల్లో జోక్యం చేసుకోవాలని కోరడం లేదని... కానీ, రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని మాత్రమే తాము కోరుతున్నామన్న న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ముగ్గురు, ఐదుగురు రాజ్యాంగ ధర్మాసనాలు కూడా స్పీకర్‌ను తగిన సమయం అని స్పష్టంగా చెప్పలేదన్నారు. అలాంటప్పుడు తాము వాటిని కాదని ఎలా ముందుకు వెళ్లగలమని.. ఉన్నత ధర్మాసనాల తీర్పులను తిరిగి రాయలేం కదా అంటూ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం అభిప్రాయపడింది. న్యాయవాది సుందరం మాట్లాడుతూ... తగిన సమయం అనే విషయంలో ఒక్కో కేసులో ఒక్కో విధంగా నిర్ణయాలు జరిగాయన్నారు. కానీ, మూడు నెలల్లో నిర్ణయం తీసుకుని అమలు చేయాలని ఒక తీర్పులో సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రాజేంద్ర సింగ్ రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుందని... కేవలం నాలుగు వారాల్లోనే నిర్ణయం కూడా జరిగి పోయిందని తెలిపారు. రాజేంద్ర సింగ్ రాణా కేసులో మూడు నెలలు కాదని.. నాలుగు వారాలే అని స్పష్టం చేయడంతో.. అనర్హత వేటు- పడిందని ఆర్యామ సుందరం వెల్లడించారు. మరో కేసులో... తగిన సమయం అంటే నిర్ణయం స్పీకర్ మాత్రమే తీసుకోవాల్సి ఉంటు-ందనిని చెప్పిందని చెబుతూ.. పాడి కౌశిక్ రెడ్డి తరపున న్యాయవాది అరియామా సుందరం వాదనలను ముగించారు. అనంతరం తదుపరి విచారణను సుప్రీం ధర్మాసనం వాయిదా వేసింది.బీఆర్ఎస్ తరపు న్యాయవాదులు సుమారు రెండు గంటల పాటు- సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ తరపు వాదనలు ముగియగా.. తదుపరి విచారణను ధర్మాసనం ఏప్రిల్ 2కు వాయిదా వేసింది.

## మొత్తం 35 సవరణలకు అనుమతి

### లోక్‌సభలో ఫైనాన్స్ బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ: ఆన్ లైన్ ప్రకటనలపై 6 శాతం డిజిటల్ పన్నును రద్దు చేయడంతో పాటు 35 ప్రభుత్వ సవరణలతో ఫైనాన్స్ బిల్లు 2025ను లోక్ సభ ఆమోదించింది. దీంతో బడ్జెట్ ఆమోదం పక్రియ లోక్‌సభలో పూర్తయింది.ఇక రాజ్యసభలో ఫైనాన్స్ బిల్లు పై చర్చ జరగనున్నది. రాజ్యసభ కూడా ఆమోదిస్తే 2025-26 బడ్జెట్ ఆమోదం పక్రియ పూర్తయినట్లే.. 2025 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరానికి కేంద్రం స్పాన్సర్ చేస్తున్న పథకాలకు రూ 5,31,850.21 కేటాయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ కేటాయింపు రూ. 4,15,356.25 కోట్లు-మాత్రమే. కేంద్ర ప్రభుత్వ రంగ పథకాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 16.29 లక్షల కోట్లు- కేటాయించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వాటా, గ్రాంట్లు-, రుణాలు, కేంద్రం ప్రాయోజిత పథకాల కింద విడుదల చేసే మొత్తంతో సహా రాష్ట్రాలకు బదిలీ అయ్యే నిధులు రూ. 25,01,284 కోట్లు-. అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు- 4.4శాతంగా అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు- 4.8 శాతంగా అంచనావేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి) రూ. 3,56,97,923 కోట్లు-గా అంచనా వేశారు. జాతీయ గణాంక సంస్థ విడుదల చేసిన ఈ ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం జిడీపీ రూ. 3,24,11,406 కోట్లు-. అంటే కొత్త ఆర్థిక సంవత్సరంలో జిడిపి 10.1 శాతం ఎక్కువగా ఉంటుందని అంచనా.

## మెగా డీఎస్సీపై ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి సంబంధించిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. నోటిఫికేషన్ అనంతరం వెనువెంటనే భర్తీ ప్రక్రియ చేపట్టి.. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు ఈ మేరకు మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో వైసీపీ పాలనకు విసిగెత్తిన ప్రజలు మాకు విస్తృత మద్దతు ఇచ్చారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే ప్రక్రియ చేపట్టామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలందరికీ అందాలని, ఆ దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల మొదటి వారంలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తెలిపారు. జూన్‌లో పాఠశాలలు తెరిచేలోపు నియామకాలు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. అలాగే మే నెలలో తల్లికి వందనం పథకం ప్రారంభించి, రూ.15 వేల చొప్పున కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని స్పష్టం చేశారు. పాఠశాలలు తెరిచేలోగా ఈ పథకం కింద ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు 10 సూత్రాల ఆధారంగా పని చేయాలని, రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ సచివాలయ పరిధి వరకూ ప్రణాళికలు చేరాల్సిందేనని అధికారులకు సూచించారు. జీఎస్‌డీపీ, జీవీఏలతో పాటు తలసరి ఆదాయం కూడా గణనీయంగా పెంచాలని అన్నారు. వచ్చే ఏడాదికి 15 శాతం ప్లస్ జీఎస్‌డీపీ సాధించేలా కలెక్టర్లు కృషి చేయాలని, అందుకు వ్యవసాయం, పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కాగా ఇప్పటికే కూటమి సర్కార్ డీఎస్సీ సిలబస్ విడుదల చేయగా.. వచ్చే నెలలోనే 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయనున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఎలాంటి చిక్కులు, అడ్డంకులు ఉండకుండా జారీ చేసేందుకు, భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 16,371 టీచర్ పోస్టుల్లో.. 6,371 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు, 7,725 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 1,781 ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ పోస్టులు, 286 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టులు, 52 ప్రిన్సిపల్ పోస్టులు, 132 పీఈటీ టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నారు.

## పోలీసుశాఖతో పెట్టుకోవద్దు

**హైదరాబాద్:** ఏ పార్టీ అధికారంలో ఉంటే వారు చెప్పిన విధంగానే పోలీసులు వింటారని, పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని అన్నారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పిన విధంగా పోలీసులు లీగల్‌గానే పనిచేస్తారని... ఆ విషయం మర్చిపోయారా కేటీఆర్ అని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలపై ఎన్నో కేసులు పెట్టి పోలీసులు జైలుకు పంపిస్తున్నారని... బీజేపీ కార్యకర్తలపై లాఠీచార్జ్‌కు చూశారన్నారు.

## ఛత్తీస్‌గడ్ ఎన్‌కౌంటర్‌లో మరో ముగ్గురు మావోల హతం

**రాయపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులను మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యాంటీ మావోయిస్ట్ ఆపరేషన్‌లో భాగంగా భద్రతా దళాలు దంతెవాడ, బిజాపూర్ జిల్లాల సరిహద్దులో ఉన్న అడవిలో ఈరోజు ఉదయం 8 గంటల సమయంలో కాల్పులు జరిపారు. మావోయిస్టులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సంఘటనా స్థలం నుంచి ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు- తుపాకులను, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు- పోలీసులు తెలిపారు. ఇంకా ఆపరేషన్ కొనసాగుతుందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసు అధికారులు తెలిపారు.కాగా, ఈ నెల 20వ తేదీన బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందిన సంగతి తెలిసిందే.



## ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు

### ఏడాదయినా కార్యరూపం దాల్చని పథకం




**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటించారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత ప్రకటించినా ఇద్దరూ మాటతప్పారు. గతేడాది జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్

హెల్త్ ప్రొఫైల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసంధానం చేయనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధించిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయనా అన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కానీ ఏడాది గడిచింది. దీనిపై అడుగు ముందుకు పడలేదు. కనీసం చర్చ లేదు. ఎక్కడా కార్యాచరణ కానరావడం లేదు.

## ఎస్ఎల్‌బీసీ ఘటనలో మరో మృతదేహం లభ్యం

మహబూబ్‌నగర్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో గత ఫిబ్రవరి 22న టన్నెల్ నందు ప్రమాదం జరుగగా ఎనిమిది మంది కార్మికులు, ఇంజనీర్లు, మిషన్ ఆపరేటర్లు చిక్కుకొని జలసమాధి అయ్యారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి పలు రెస్క్యూ టీంలు రేయింబవళు వారి ఆచూకీం కోసం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలోనే మరో కార్మికుడి మృతదేహం ఆచూకీ లభ్యమైనది. టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగిస్తున్న రెస్క్యూ సిబ్బందికి టిబిఎం మిషన్ కింద కన్వేయర్ బెల్టు డ్రమ్‌కు 40 మీటర్ల దూరంలో మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. టన్నెల్ నందు మినీ జెసిపి ద్వారా శిథిలాలు తొలగించడం, మట్టి బురదను బయటకు పంపడం సహాయక చర్యలు కొనసాగుతుండగా శిథిలాల కింద మృతదేహం ఆనవాళ్లు కనిపించాయి. అట్టి మృతదేహం పూర్తిగా కుళ్ళిపోయి ఉండడం, ఆ ప్రదేశం భరించలేని దుర్వాసన వస్తుండడంతో మిగిలిన ఆరుగురి మృతదేహాలు కూడా అదే ప్రదేశంలో ఉండే అవకాశం ఉంటుందని అనుమానిస్తున్నారు.

## దక్షిణాదిలో డీలిమిటేషన్ కాక హుటాహుటిని ఢిల్లీకి పళనిస్వామి



**చెన్నై:** దక్షిణాదిలో డీలిమిటేషన్ వ్యవహారం కాకరేపుతున్న తరుణంలో అన్నాడి ఎంకె ప్రధాన కార్యదర్శి, మాజీ సిఎం పళని స్వామి హుటా హుటిన ఢిల్లీకి బయలుదేరారు. ఇప్పటికే తమిళనాడు ముఖ్య మంత్రి స్టాలిన్ నేతృత్వంలో కేంద్రంపై పోరాటానికి దిగారు. ఇప్పటికే పార్లమెంట్ ఉభయసభల్లో డీఎంకే సభ్యులు పోరాటం చేస్తున్నారు. ఇటీవల చెన్నై వేదికగా దక్షిణాది రాష్ట్రాల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఒడిశా, పంజాబ్ నుంచి ముఖ్యమంత్రులు, డిప్యూటీ- సీఎంలు హాజరై తమ గళాన్ని తెలియజేశారు. డీలిమిటేషన్‌తో ఏర్పడే విపత్తును గురించి ప్రస్తావించారు. తదుపరి సమావేశాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెద్ద ఎత్తున భారీ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రచిస్తున్నారు. ఇదిలా ఉంటే డీలిమిటేషన్‌పై ఉద్యమం ఉధృతం అవుతున్న వేళ బీజేపీ అధిష్టానం అప్రమత్తం

అయింది. తమిళనాడు అన్నాడీఎంకే ప్రధాని కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి పళినిస్వామికి కబురు పంపింది. దీంతో ఆయన అత్యవసరంగా దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరారు. ఢిల్లీలో బీజేపీ అగ్ర నేతలను కలిసే అవకాశం ఉంది. సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసే ఛాన్సుందని తెలుస్తోంది. అంతేకాకుండా వచ్చే ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మరోసారి బీజేపీ-ఏఐడీఎంకే పొత్తు ఉండే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# బట్టలు విప్పుడు.. కత్తులు దూసుడు

**హైదరాబాద్:** మాజీ మంత్రి మల్లారెడ్డి ఎప్పుడు ఉన్నది ఉన్నట్టు మాట్లాడటం ఆయన నైజాం. ఆయన పలు విచిత్రంగా స్టేజీలమీద, విలేకరుల సమావేశాల్లో పలు కామెంట్లు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలమీద మంగళవారం కామెంట్ చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది. పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజుపేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అత్తుకుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి. ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. మంగళవారం అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. దీంతో వీరిద్దరి పలుకరింపులు ఆసక్తిగా మారాయి.

**స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు బాధ కలిగించాయి : ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

స్పీకర్ ప్రసాద్‌కుమార్ వ్యాఖ్యలు తనకు బాధ కలిగించాయని నారాయణఖేడ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. తాను ఏం తప్పు చేశానని, మీకు ఎందుకు అలా వినాలనిపించలేదని స్పీకర్‌ను ప్రశ్నించారు. విషయంపైనే మాట్లాడానుతప్ప ఎక్కడా పరిధి దాటలేదన్నారు. అయినా తనను అలా వినబుద్ధికావడం లేదని ఎలా అంటారన్నారు. తనపై వ్యాఖ్యలను స్పీకర్ ఉపసంహరించుకోవాలన్నారు. శాసనసభలో సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. "సభ్యుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌పైనే ఉంటుందని తెలిపారు. నిన్న మీరు చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరమని పేర్కొన్నారు. తాను మాట్లాడుతున్న సందర్భంలో సబ్జెక్టునుంచి ఎక్కడా డీవియేట్ కాలేదు. మహిళలు, శిశు సంక్షేమం, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై మాట్లాడుతానని ముందే సమాచారం ఇచ్చానన్నారు. అవకాశం కోసం సాయంత్రం వరకు నిరీక్షించా. రాత్రి 8 గంటలకు మాట్లాడేందుకు తనకు అవకాశం కల్పించారన్నారు. రెండు నిమిషాల్లో పూర్తిచేయాలన్నారు. తాను మాట్లాడుతుండగా.. నాకే వినబుద్ధి అవడలేదని, మీరంతా ఎలా వింటున్నారో అని మీరు అనడం నాకు చాలా బాధకలిగించింది. ఒక మహిళగా, సీనియర్ సభ్యురాలినైనా తాను ఎక్కడా అన్‌పార్లమెంటరీ మాట్లాడలేదని.. ఎందుకంటే సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, సభ్యులు అంతా మాట్లాడినప్పటికీ.. జీరో అవర్‌లో ఒకటే సబ్జెక్ట్ మాట్లాడాలని, అసభ్య పదజాలం మనం ఉపయోగించకూడదని కొత్తగా వచ్చిన మా సభ్యులకు చెబుతానని తెలిపారు. ఒకరికి చెప్పగలిగిన స్థాయిలో ఉన్న తనను మీరు మాట్లాడిన మాటలు చాలా బాధ కలిగించాయని ఆవేదన వ్యక్తంచేశారు. సబ్జెక్టును మించి ఒక విషయం కూడా బయటకు జరుగలేదు. అలాంటి సమయంలో మీరు మాట్లాడిన మాటలు నాకు బాధ కలించాయి. సభలో నిరసనల మధ్య తనకు సరిగా వినపడలేదని, వాకౌట్ చేసి బయటకు వెళ్లిన తర్వాత మా సభ్యులు చెప్పారు. తాను తప్పేంమాట్లాడానో చెప్పండి. నా నియోజకవర్గానికి సంబంధించిన సమస్యల గురించి మాట్లాడానే తప్ప మరో విషయం కాదు. మీ వ్యాఖ్యలు మంచిగనిపిస్తే రికార్డుల్లో కొనసాగించండి. లేదంటే ఉపసంహరించుకోవాలి. సభాపతిగా మా హక్కులు కాపాడాల్సిన బాధ్యత స్పీకర్‌ది. అధికార పక్షానికి నచ్చకపోతే బాగాలేదని చెప్పాలి. గతంలో కూడా మహిళలను ఉద్దేశించి ముఖ్యమంత్రి అభ్యంతరకరంగా మాట్లాడారని, అయినప్పటికీ నిలుచుని మానంగా నిరసన తెలిపాం. ఇలాంటివి మరోసారి జరగకూడదని, సభా సంప్రదాయాలకు మంచిదికాదు' అని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు లక్ష్మారెడ్డి సూచించారు. కాగా, స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. మహిళలంటే తనకు ఎనేలని గౌరవం ఉందన్నారు. తనకు 8 మంది సోదరీమణులు ఉన్నారని, మహిళలను గౌరవిస్తానని చెప్పారు. 'మిమ్మల్ని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేయలేదు. తాను ఈ సీటు మీద ఉండి తమను అన్నానని అనుకోవడం చాలా పొరపాటు. మీరు మాట్లాడేటప్పుడు ఇరువైపులా నుంచీ రన్నింగ్ కామెంట్ వస్తున్నదన్నారు.

# మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు.

**సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఆర్థిక పరిపుష్టి సాధించాలి.**

**ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హితవు.**

**అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తాం : కలెక్టర్.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 25 :**

యాసంగి సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామని మాజీ మంత్రి, సీనియర్ శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జిల్లాలో 670 కొనుగోలు కేంద్రాలకు గాను, వాటిలో మహిళా సంఘాలకు కనీసం 200 పైచిలుకు కేంద్రాలను కేటాయించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం మహిళా సంఘాల ప్రతినిధులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొని ధాన్యం సేకరణ, కొనుగోలు కేంద్రాల నిర్వహణపై మహిళా సంఘాలకు కీలక సూచనలు చేశారు. మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థిని, విద్యార్థులు యూనిఫామ్ లు కుట్టే బాధ్యతలను, ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సులు, పెట్రోల్ బ్యాంకులు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు వంటి సుమారు 14 రకాల పనులను ప్రభుత్వం మహిళలకు కేటాయిస్తూ, వారి అభ్యున్నతికి ఇతోధికంగా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా జిల్లాలోని మహిళా సంఘాలు మరింత ఆర్థిక ప్రగతిని సాధించాలనే ఆకాంక్షతో సాధ్యమైనంత మేరకు ఎక్కువ సంఖ్యలో కేంద్రాలను కేటాయించాలని నిర్ణయించామని తెలిపారు. గత సీజన్ లో ఐకెపి మహిళా సంఘాల ద్వారా జిల్లాలో కేవలం 50 కేంద్రాలు మాత్రమే నిర్వహించబడ్డాయని,

ప్రస్తుత సీజన్ లో ఇప్పటికే 110 కేంద్రాల నిర్వహణ కోసం ఎస్.హెచ్.జి గ్రూపులను గుర్తించడం జరిగిందని వివరించారు. వీటి సంఖ్యను కనీసం 200 పైబడి పెంచాలని, తద్వారా మహిళా సంఘాలు కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా కమీషన్ రూపేణా సుమారు 5 కోట్ల రూపాయల వరకు లాభాలు ఆర్జించగలుగుతారని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆశాభావం వెలిబుచ్చారు.



**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ ,**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించే మహిళా సంఘాలకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా మద్దతు అందిస్తామని భరోసా కల్పించారు. ముఖ్యంగా ధాన్యం రవాణాకు సంబంధించిన

లారీల విషయంలో, అలాగే హమాలీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ధాన్యం సాధారణ రకానికి క్వింటాలుకు రూ. 2300, ఏ గ్రేడ్ ధాన్యానికి, రూ. 2320 రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని, దీనితో పాటు సన్న ధాన్యానికి బోనస్ రూపంలో అదనంగా క్వింటాలుకు 500 రూపాయల చొప్పున ప్రభుత్వం రైతులకు వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకాంత్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్, మెప్మా పీ.డీ రాజేందర్, డీసీఓ శ్రీనివాస్, మార్కెటింగ్ ఏ.డీ గంగవ్వ, స్వయం సహాయక మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాది హత్యపట్ల"బార్" నిరసన.

**- ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటుకు డిమాండ్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 25:**






రంగారెడ్డి బార్ అసోసియేషన్ న్యాయ వాది ఎర్రబాపు హత్యను నిరసిస్తూ మంగళవారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్ లో నిర్వహించిన అత్యవసర సమావేశంలో మృతుడు ఎర్రబాపుకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాప సందేశం పంపినట్లు ఆందో ళన నిర్వహించినట్లు బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ తెలిపారు. హత్యకు నిరసనగా న్యాయస్థానాలలో కోర్టు విధులను దూరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఎర్రబాపు హత్యపై సమగ్ర విచారణ జరిపి హంతకులను చట్టంముందు దోషులుగా నిలబెట్టాలని జగన్ కోరారు. దేశ, రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు హంతక ముఠాలచే హత్యలకు గురికావడం ఆవేదన కలిగిస్తున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. హత్యల పరంపర ఆగాలంటే న్యాయవాదుల రక్షణ చట్టం సమగ్రంగా తయారు చేయాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో శాసనసభ లో ప్రవేశపెట్టిన న్యాయవాదుల రక్షణ చట్టం ఆమోదించడానికి అన్ని రాజకీయ పార్టీలు అంగీకరించి చట్టరూపం దాల్చడానికి సహకరించాలని జగన్ కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి వసంత్ రావ్, ఉపాధ్యక్షులు పెండం రాజు, దొంపల్ సురేష్ , కార్యదర్శి ఏ. దీపక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాజేందర్, న్యాయవాదులు విఘ్నేష్, వెంకటేశ్వర్, రవి, పిల్లి శ్రీకాంత్, ప్రేమ్ కుమార్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళకు ఏర్పాట్లు పూర్తి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 25:**

ధాన్యం కొనుగోళ్ళకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయం నందు మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, రబీ సీజన్ లో ధాన్యం సేకరణకు 446 కేంద్రాలను ఏర్పాటు చేశామని, అధికారులు కొనుగోలు కేంద్రాల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రానున్న యాసంగి సీజన్ లో 26 వేల ఎకరాల వరి పంట సాగు చేసినందున సుమారుగా 6.20 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలకు 5.63టన్నుల ధాన్యం రానున్నదని అంచనా వేశారు. అలాగే ప్రభుత్వ అధికారులు పూర్తి సమన్వయంతో పని చేస్తూ కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలనీ అయన కోరారు. ధాన్యం వచ్చిన ప్రాంతాలలో వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సూచనలు చేశారు. అదే విధంగా అకాల వర్షాలను దృష్టి లో ఉంచుకొని కేంద్రాలలో తగినన్ని టార్పాలిన్ లను ఏర్పాటు చేయాలనీ మార్కెటింగ్ శాఖ వారికి సూచించారు. ప్రతి కేంద్రం లో రైతులకు త్రాగునీరు, ఓఆర్ ఎస్ ప్యాకేట్స్, ఎండా తీవ్రతకు తగిన టెంట్లు ఏర్పాట్లు చేసుకోవాలని సరిపడా తేమ యంత్రాలు, ప్యాడి క్లినర్స్ అందజేయాలని కోరారు. జిల్లాకు కేటాయించిన ప్యాడి క్లినర్స్ ను సద్వినియోగం చేసుకోవాలని అలాగే గోనె సంచులు అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతుల నుండి సేకరించిన ధాన్యానికి క్వింటాలు కు కనీస మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి గాను రూ.2,320/-, కామన్ రకానికి రూ. 2,300/- మరియు సన్న రకం వడ్లకు చెల్లించాల్సిన 500/- బోనస్ కొరకు రైతులు తమ ధాన్యం వివరములను ట్యాబ్ లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని 24 గంటలలో వారి బ్యాంక్ ఖాతాలలో డబ్బులు పడేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను పరిష్కరించాడానికి జిల్లా కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 08468-220051 ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) వి.విక్టర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డి సి ఎస్.ఓ మల్లిఖార్జున బాబు, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా మార్కెటింగ్ అధికారిణి రమ్య, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి శ్రీనివాస్ మరియు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# పోరాటం"తోనే రైతాంగ సమస్యలకు పరిష్కారం.






**కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించింది.**

**జై జవాన్ జై కిసాన్ నినాదానికి బదులు జై అంబానీ, జై ఆదాని.**

**సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెల్లడి.**

**ఘనంగా తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 25:**

పోరాటంలతోనే రైతాంగం, వ్యవసాయ రంగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలు నిజామాబాద్ నగరంలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. గోనె రెడ్డి ఫంక్షన్ హాల్లో బహిరంగ సభ నిర్వహించగా ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఆహ్వాన సంఘం కోశాధికారి కంజర భూమయ్య సభ అధ్యక్షత వహించారు. ఈ బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నెల్లి కంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంత రావు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహా సభలను ఉద్దేశించి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను విస్మరించిందని, మూడు నల్ల చట్టాలను తెచ్చి రైతులను నిండా ముంచిందన్నారు. చారిత్రాత్మకమైన రైతుల పోరాటాల ఫలితంగానే మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు రద్దు చేయబడ్డాయని గుర్తు చేశారు. మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్లకు కొమ్ము కాస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి రైతులకు న్యాయం జరిగేలా చట్టాలు రూపొందించడం లేదని పేర్కొన్నారు. పసుపు బోర్డు తెస్తామని చెప్పి ఎంపీగా గెలిచిన ధర్మపురి అరవింద్, ఏట్టకేలకు పసుపు బోర్డు ఇచ్చిన పసుపుకు మద్దతు ధర ఇవ్వలేక రైతులను మోసం చేస్తున్నారన్నారు. పసుపు మద్దతు ధర ఇవ్వకుండా రైతులు రోడ్డు నెక్కే పరిస్థితి ఏర్పడేలా చేశారన్నారు. భారతదేశంలో నూటికి 75% మంది రైతులు వ్యవసాయం మీద ఆధారపడ్డారని, వారికి సరైన సదుపాయాలు కల్పించ లేకపోవడంతో పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ప్రతిరోజు దాదాపు 36 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అంటే అందుకు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధివిధానాలేనని అన్నారు. ప్రపంచ దేశాలలో వ్యవసాయానికి సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుంటే, మోడీ ప్రభుత్వం మాత్రం సబ్సిడీలు ఇవ్వకుండా, అంబానీ, ఆదానిలాంటి కార్పొరేట్ సంస్థలకు వత్తాసు పలుకుతున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం సాగునీటి కోసం ఏ ఒక్క ప్రాజెక్టును కూడా సంపూర్ణంగా నిర్మించలేకపోయిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ విభజన చట్టంలో తెలంగాణకు ఎలాంటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదని అన్నారు. ఉత్తర భారతదేశంలో ఉన్న ప్రాజెక్టులకు మాత్రమే జాతీయ హోదా కల్పించి, నిధులు విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో సైతం కృష్ణనదిలో వాటా తేల్చక పోవడంతో ఆంధ్రకు నీళ్ళు దోచుకు పోతున్నారని గుర్తు చేశారు. భాగం హేమంతరావు, పశ్య పద్మ మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేసి కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఆకర్షితులై ప్రజలు ఓట్లు వేశారని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వేర్చాలన్నారు. రెండు లక్షల రుణ మాఫీ పూర్తి గా అమలు కావడం లేదనీ,

రైతు భరోసా పూర్తిగా అందలేదని, రైతులు పండించిన పసుపు, మిర్చి, వరి పంటకు గిట్టుబాటు ధర అందడం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని అన్నారు. ఇటీవల తెలంగాణ జిల్లాలో వడగళ్ల వానతో తీవ్రంగా పంట నష్టం జరిగిందని, ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ జిల్లా నాయకులు వై.ఓమయ్య, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వైరాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అడ్డికే రాజేశ్వర్ మరియు రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు ఆహ్వాన సంఘం నాయకులు పాల్గొన్నారు.




# ఆచార్య అరుణకు ఇంటర్నేషనల్ అవుట్ స్టాండింగ్ రీసర్చ్ అవార్డు.

**- విశ్వవిద్యాలయానికే గర్వకారణం. టియు వైస్ ఛాన్సర్ టి. యాదగిరిరావు.**

**వేగుచుక్క న్యూస్ , డిచ్ పల్లి , మార్చి 25**

తెలంగాణ విశ్వవిద్యాలయం వృక్షశాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు ఎం. అరుణకు బోధన మరియు పరిశోధన విభాగంలో ఇంటర్నేషనల్ అవుట్ స్టాండింగ్ రీసెర్చ్ అవార్డ్ లభించినందుకు వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి అభినందించారు. టీయూ లో మంగళవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వైస్ ఛాన్సర్ ఆచార్య. టి. యాదగిరిరావు మాట్లాడుతూ, ఆచార్య అరుణ హైడ్రోబయాలజీ మరియు ఆల్గల్ బయోటెక్నాలజీ విభాగంలో అద్భుతంగా చేసిన ఉన్నతమైన పరిశోధనలను గుర్తించి తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఈనెల 23 న జరిగిన ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాంగ్రెస్ 2025 అవార్డు కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఔట్ స్టాండింగ్ రీసర్చ్ అవార్డు లభించటం విశ్వవిద్యాలయానికే గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా తెయు విసి ఆచార్య యాదగిరిరావు, రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి లు ఆచార్య అరుణకు మెమొంటో బహుకరించి సత్కరించినారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఏ.ఏ. హలీంఖాన్, ఆచార్య బి. విద్యావర్ధిని అధ్యాపకులు డాక్టర్ శ్రీనవాస్, డాక్టర్ జలంధర్ లు అభినందనలు తెలిపారు.





# అంగరంగ వైభవంగ ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు.





**6వ రోజు యాగం మహా పూర్ణాహుతి, చక్ర స్నానం, శ్రీపుష్ప యాగం.**

**ఇలలో మరో వైకుంఠం ఇందూరు తిరుమల.**

**శ్రీ దేవనాథ జీయరు స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 25:**

ఇందూరు తిరుమల 11వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు (మంగళవారం) యాగశాలలో మహా పూర్ణాహుతి అనంతరం భక్తులను ఉద్దేశించి దేవనాథ జియర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి వారు ప్రవచనాలు చేశారు. "మహా పూర్ణాహుతి" అనంతరం స్వామి వారికి చక్ర స్నానం కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. మనుషులు సదా భగవంతునికి కృతజ్ఞాతపూర్వకంగా ఉండాలని దేవనాథ జియర్ స్వామి అన్నారు. భగవంతుడు లోక కార్యం మనుషుల ద్వారా చేస్తారనీ అన్నారు. భగవంతుడి కృప వల్లనే మనిషి గొప్పగా ఎదుగుతాడు అని అన్నారు. మనిషి లోపల భూత దయ, ప్రకృతి పట్ల ప్రేమ, దేశ భక్తి ఉండాలనీ అన్నారు. "ఇందూరు తిరుమల ఇలలో మరో వైకుంఠంగా" వెల్గొనన్నుది అని అన్నారు. చక్ర స్నానం మరియు పుష్పయాగం కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రముఖ నిర్మాత దేవనాథ జియర్ స్వామి, గంగోత్రి రామానుజ జియర్ స్వామి, ఆలయ ధర్మకర్తలు నర్సింహ్మ రెడ్డి దంపతులు, దిల్ రాజు దంపతులు శిరీష్ రెడ్డి దంపతులు, విజయసింహా రెడ్డి దంపతులు, హరీష్ దంపతులు, సుధర్షన్ రెడ్డి దంపతులు, గంగాధర్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, రమేష్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

**బ్రహ్మోత్సవాల్లో సినీ ప్రముఖులు.**

బ్రహ్మోత్సవాల్లో 6వ రోజు సినీ ప్రముఖులు, ప్రముఖ దర్శకులు అనిల్ రావిపూడి, ఛాయాగ్రాహకుడు సమీర్ రెడ్డి, సినీ హీరోలు ఆర్.నారాయణ మూర్తి, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.



# కాకతీయ(కేఓఎస్)లో "రోబోటిక్స్ ఎక్స్ పో - 2025".






**ఆకట్టుకున్న విద్యార్థుల వివిధ రకాల ప్రదర్శనలు.**

**విద్యార్థులను అభినందించిన డిఇఓ అశోక్ కుమార్.**



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 25:**

నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ అయిన కాకతీయ ఒలంపియాడ్ స్కూల్లో మంగళవారం "టెట్రోనికా రోబోటిక్స్ ఎక్స్ పో - 2025" ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వివిధ రకాల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి తరలివచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు తయారు చేసినటువంటి ప్రాజెక్టులను చూసి, వాటి ఉపయోగాలు తెలుసుకొని, అత్యాధునికమైన పరికరాలను చూసి ఎంతగానో సంతోషించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థుల ప్రదర్శనలు చూసి మెచ్చుకున్నారు. వాటి ఉపయోగాలు ఏమిటి అని క్షుణంగా ప్రతి విద్యార్థిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో అగ్రికల్చర్ అటానమస్, మెకానికల్ ఎడ్యుకేషనల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మీదనే అధారపడి ఉంటుందని అన్నారు. ఇలాంటి విద్యను కాకతీయ ఒలంపియాడ్ స్కూల్లో విద్యార్థులకు అలాంటి విద్యను అందించడం చాలా గర్వకారణం అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు జరగడం మన జిల్లా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందని అని అన్నారు.

కాకతీయ విద్యా సంస్థ **డైరెక్టర్ సిఎచ్.తేజస్విని మాట్లాడుతూ..** భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం కోసం పాటు పడుతున్నామని అన్నారు. హైదారాబాద్ వంటి మహానగరాల్లో అందించే కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా జిల్లా కేంద్రంలో విద్యా బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థ డైరెక్టర్లు సిఎచ్. రజనీకాంత్, సిఎచ్. రాజ, సిఎచ్. రామోజీ రావు, ప్రిన్సిపాల్ నటరాజ్, కో ఆర్డినేటర్ శ్రీలత, రోబోటిక్ హెచ్ఓడి సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



# అమ్మకాల్లో టెస్లాను దాటేసిన బీవైడీ..!

చైనా కార్ల తయారీ సంస్థ బీవైడీ నుంచి అమెరికాకు చెందిన టెస్లాకు తీవ్రమైన పోటీ వస్తోంది. తాజాగా వార్షిక ఆదాయాల్లో మస్క్ నేతృత్వంలోని సంస్థను మించింది. షెంజెన్ కేంద్రంగా పనిచేసే బీవైడీ గతేడాది 107 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించినట్లు పేర్కొంది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 29శాతం అధికం. ఇక ఇదేకాలంలో టెస్లాకు వచ్చిన ఆదాయం 97.7 బిలియన్ డాలర్లే కావడం గమనార్హం. బీవైడీ విక్రయాల్లో హైబ్రీడ్ వాహనాల జోరు కొనసాగుతోంది.

బీవైడీ గతేడాది టెస్లా విక్రయించిన విద్యుత్తు వాహనాల సంఖ్యకు (17.9 లక్షల) దాదాపు సమానంగా 17.6 లక్షల వాహనాలను అమ్మింది. కానీ, దీనిలో హైబ్రీడ్ వాహనాల విభాగంలో మాత్రం భారీ పెరుగుదలను నమోదు చేసింది. ఈసారి ఆ కంపెనీ ఏకంగా 43 లక్షల వాహనాలను ప్రపంచవ్యాప్తంగా విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. క్విన్ ఎల్‌గా పిలిచే ఈ కారు ధర టెస్లా మోడల్ 3లో దాదాపు సగమే ఉంది.

ఇటీవలే ఈ చైనా సంస్థ టెస్లా మోడల్ 3కి పోటీగా ఓ చౌక మోడల్ కారును తీసుకొచ్చింది. చైనా ఈవీ మార్కెట్లో దూసుకెళ్లేందుకు వీలుగా దీనిని తీసుకువచ్చినట్లు సమాచారం.

దీంతోపాటు బీవైడీ ఈ ఏడాది సరికొత్తగా ఫాస్ట్ ఛార్జింగ్ టెక్నాలజీలను ముందుకుతీసుకొచ్చింది. కేవలం ఐదు నిమిషాలు ఛార్జింగ్ చేస్తే.. 400 కిలోమీటర్లు దూసుకుపోవచ్చు. అదే సమయంలో టెస్లాలో 15 నిమిషాలు ఛార్జింగ్ పెట్టాల్సిరావచ్చు. ఇక బీవైడీ బేసిక్ మోడల్స్‌లో కూడా ఉచితంగా సరికొత్త డ్రైవర్ అసిస్టెన్స్‌ను సిద్ధం చేసింది. దీనికి 'గాడ్స్ ఐ' అని పేరు పెట్టింది.

గత కొంతకాలంగా టెస్లా సారథి మస్క్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలు నెరపడంతో కూడా ఈ కంపెనీ కార్ల విక్రయాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. మరోవైపు చైనా తయారీ కార్లపై పశ్చిమదేశాల్లో భారీగా పన్నులు విధిస్తున్నారు.

# సూచీలు లాభపడినా.. తగ్గిన సంపద విలువ

**ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.5,372 కోట్లు**

**డీఐఐ విక్రయాలు: రూ.2,769 కోట్లు**

మంగళవారం ఆద్యంతం ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు స్వల్ప లాభాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ వంటి పెద్ద షేర్లు రాణించడంతో సూచీలు వరుసగా ఏడో రోజూ మెరిశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 11 పైసలు తగ్గి 85.72 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.53% లాభంతో 73.39 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మాత్రం రూ.3.34 లక్షల కోట్లు తగ్గి రూ.414.94 లక్షల కోట్లు (4.84 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది. సెన్సెక్స్ ఉదయం 312 పాయింట్ల (క్రితం ముగింపు 77,984.38) లాభంతో 78,296.28 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రారంభ ట్రేడింగ్‌లో 78,741.69 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీకి, అనంతరం లాభాల స్వీకరణ ఎదురైంది. ఒకదశలో 77,745.63 వద్ద కనిష్ఠాన్ని తాకినా, చివరకు 32.81 పాయింట్ల లాభంతో 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి 23,668.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,601.40– 23,869.60 పాయింట్ల మధ్య కదలాడింది. డెరివేటివ్స్ పోర్ట్‌ఫోలియోలో అకౌంటింగ్ లోపాలకు సంబంధించి ప్రత్యేక ఆడిటర్ పీడబ్ల్యూసీ తన నివేదికను బ్యాంక్ బోర్డుకు శుక్రవారం సమర్పించే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేరు 4.76% నష్టపోయి రూ.637.30 వద్ద ముగిసింది. సంస్థ మార్కెట్ విలువ రూ.2,481.1 కోట్లు తగ్గి రూ.49,649.14 కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో 10 రాణించాయి. అల్ట్రాటెక్ 3.41%, బజాజ్ ఫిన్‌సర్వ్ 2.71%, ఇన్ఫోసిస్ 2.48%, యాక్సిస్ బ్యాంక్ 1.97%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.13%, హెచ్‌సీఎల్ టెక్ 0.94% లాభపడ్డాయి. జొమాటో 5.79%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 4.76%, అదానీ పోర్ట్స్ 1.44%, ఎం అండ్ ఎం 1.39%, రిలయన్స్ 1.23%, సన్‌ఫార్మా 1.08%, ఎస్‌బీఐ 1.07% నష్టపోయాయి.